ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తావిభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 02-09-2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1 . రాష్ట్రంలో వర్షాలు, వరద కారణంగా మ్రుతి చెందిన వారి కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

2. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. వరద, ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే సహాయక చర్యల్లో పలువురు మంత్రులు, ప్రభుత్వ యంత్రాంగం నిమగ్నమైంది.

3. భారీ వర్షాలు , వరదల నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ , కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి రాష్ట్రంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

4. ఆరోగ్యకరమైన దేశ నిర్మాణంలో పోషకాహారం ముఖ్య భూమిక పోషిస్తుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. కేంద్ర సమాచార ప్రసార శాఖ , సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ర్పాటు చేసిన 'ప్రతి ఒక్కరికీ పోషకాహారం' ప్రదర్శనను గవర్నర్ ఈరోజు హైదరాబాద్ లో ప్రారంభించారు.

**ముఖ్యమంత్రి సమీక్ష**

రాష్ట్రంలో వర్షాలు , వరద కారణంగా మ్రుతి చెందిన వారి కుటుంబాలకు 5 రూపాయల లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో పరిస్థితిని జాతీయ విపత్తుగా పరిగణనలోకి తీసుకుని , తక్షణమే సాయం చేయాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాశారు. వర్షాలు , వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. భారీ వర్ష సూచన ఉన్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టరేట్లలో కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని , కమాండ్ కంట్రోల్ సెంటర్ లో వ్యవస్థ ను సన్నద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో అత్యవసర సేవల కోసం రాష్ట్రంలోని 8 పోలీస్ బెటాలియన్ల కు ఎన్డీఆర్ఎఫ్ తరహా లో శిక్షణ ఇవ్వాలన్నారు. వరద ప్రభావిత జిల్లాలు ఖమ్మం , భద్రాద్రి కొత్త గూడెం , మహబూబాబాద్, సూర్యాపేట కలెక్టర్ల లకు తక్షణ సాయం కోసం 5 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. ప్రజలకు జరిగిన నష్టం పై తక్షణమే అధికారులు స్పందించాలని, వరదల్లో చనిపోయిన పశువులు , మేకలు,గొర్రెల కు పరిహారం పెంచాలని ఆదేశించారు.

(పీఎన్)

వర్షాలు-లీడ్

రాష్ట్రంలో మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించింది. వాగులు , చెరువులు పొంగిపొర్లడంతో పలు ప్రాంతాలు

నీట ముగిగాయి. పలు జిల్లాల్లో రోడ్లు , రహదారులు, బ్రిడ్జీలు దెబ్బతిన్నాయి. రైల్వే లైన్లపై నీరు చేరడంతో రవాణా స్థంభించింది. మరోవైపు వరద , ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు ముమ్మరం చేసింది. మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. కాగా, రాష్ట్రంలో నేడు, రేపు కూడా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

(డెస్క్)

మహబూబాబాద్ వర్షాలు

కాగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మహబూబాబాద్ జిల్లా అతలాకుతలమైంది. జిల్లా వ్యాప్తంగా రోడ్డు , రైలు రవాణా సౌకర్యాలు స్తంభించిపోయాయి. వివిధ మండలాల్లో అనేక వాగులు పొంగి పొర్లుతున్నాయి. దాంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. అనేక కాలనీలు జలదిగ్బంధనంలో ఉన్నారు. జిల్లా లో ఈదుల పూసపల్లి చెరువు అలుగు పోతుండటంతో నీరు రోడ్డుపైకి రావడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. గూడూరులో పాకాల పాగు పొంగిపొర్లుతుండడంతో నెక్కొండ, కేసముద్రం, గూడూరుకు రాకపోకలు బంద్ అయ్యాయి. అయోధ్యపురం గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. బొల్లెపల్లి శివారు చిన్న రావుల చెరువు కట్టలు తెగిపోయాయి. దొరవారి తిమ్మాపురం వద్ద వాగు పొంగి పొల్లుతుండడంతో భూపతిపేట సీతానగరం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బయ్యారంలోని

పందిపంపుల వాగు, సుద్దరేవు వాగు,వట్టువాగు, గౌరారం కట్టు పొంగిస్తున్నాయి. సమీప గ్రామాలకు రాకపోకలను నిలిచిపోయాయి. రాంపురం బ్రిడ్జిపై నుండి పాకాల వాగు పొంగి ప్రవహిస్తుండడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా 29.67 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది.

పి.టి.సి, మహబూబాబాద్

మంత్రి ధనసరి అనసూయ

కాగ మహబూబాబాద్ జిల్లా కేంద్రం లో వర్షానికి నీట మునిగిన పలు కాలనీలు , దెబ్బతిన్న రహదారులను రాష్ట్ర పంచాయతీరాజ్ , గ్రామీణ అభివృద్ధి , స్త్రీ శాఖ మంత్రి ధనసరి అనసూయ పరిశీలించారు. వర్షం బాధితులను ఓదార్చి భరోసా కల్పించారు.

PTC

సూర్యపేట-మంత్రి ఉత్తమ్

భారీ వర్షాల కారణంగా సూర్యాపేట జిల్లాకోదాడలో మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాలను ఆదుకుంటామని , పంట నష్ట పోయిన రైతులకు పరిహారం చెల్లిస్తామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ హుజూర్నగర్ నియోజకవర్గం చెరువులను కాలువలను మంత్రి ఈ ఉదయం పరిశీలించారు.

(పీటీసీ సూర్యాపేట)

**సీఎం- మోదీ, అమిత్ షా**

రాష్ట్రంలో భారీ వర్షాలు , వరదల నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ , కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిన్న రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఫోన్ లో మాట్లాడారు. రాష్ట్రంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు, వరద పరిస్థితులు, వరదల వల్ల జరిగిన నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో తాజా పరిస్థితులపై ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా , ప్రాణ నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తక్షణ సహాయక చర్యలను రేవంత్ రెడ్డి ప్రధానమంత్రికి వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు అవసరమైన తక్షణ సాయం చేస్తామని , వరద సహాయక చర్యల్లో సహకారం అందిస్తామని ముఖ్యమంత్రికి అమిత్ షా హామీ ఇచ్చారు.

(డెస్క్)

ఏపీ-వర్షాలు

అంధ్రప్రదేశ్ లో భారీ వర్షాల కారణంగా ఆంధ్రప్రదేశ్ లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు, వరదలతో విజయవాడ నగరం తీవ్రంగ ప్రభావితం అయింది. మరికొన్ని జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సరిహద్దు జిల్లాల్లో రహదారులపై భారీగా వరద నీరు చేరడంతో ఇరు రాష్ట్రాలకు మధ్య పలు ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను నేరుగా పర్యవేక్షిస్తున్నారు.

(డెస్క్)

సంగారెడ్డి-మంత్రి రాజనర్సింహ్

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వర్ష ప్రభావిత ప్రాంతాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ , జిల్లా కలెక్టర్ వల్లూరి. క్రాంతి తో సమీక్షించారు. వర్ష ప్రభావిత ప్రాంతాలలో ఆస్తి నష్టం , ప్రాణ నష్టం జరగకుండా సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 9 మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా, 19 మండలాల్లో ఓ మోస్తారు వర్షం నమోదయింది.

(SANGAREDDY PTC )

సూర్యపేట-రహదారి

సూర్యాపేట జిల్లాలో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ వద్ద రామాపురం ఎక్స్ రోడ్డు వద్ద నిర్మించిన బ్రిడ్జి గత రాత్రి తెగిపోవడంతో జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను దారి మళ్ళి ఇస్తున్నారు. మరోవైపు కోదాడలో చిక్కుకున్న ప్రయాణికులు గత రెండు రోజులుగా అవస్థలు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసి తమని గమ్యస్థానాలకు చేర్చాలని కోరుతున్నారు.
(పీటీసీ, సూర్యాపేట)

నాగర్ కర్నూల్-శ్రీశైలం

నాగర్‌కర్నూల్ జిల్లాలో వర్షాల ప్రభావం ఇంకా కొనసాగుతూనే ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 4 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చి చేరుతోంది. 10గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దుందుభి నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

(పీటీసీ, నాగర్ కర్నూల్ జిల్లా)

**CBC POSHAN ABHIYAN:**

కేంద్ర సమాచార ప్రసార శాఖ , సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ర్పాటు చేసిన 'ప్రతి ఒక్కరికీ పోషకాహారం ' ప్రదర్శనను రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈ ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానమే వికసిత్ భారతమని చెప్పారు. ప్రజలకు పోషకాహారం గురించి అవగాహనను ప్రజలకు కల్పించేందుకు జానపద కళారూపాలను , స్థానిక భాషను వినియోగించటాన్ని గవర్నర్ అభినందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఈ మాదిరి సృజనాత్మకతను అనుసరించాలని గవర్నర్ అభిప్రాయపడ్డారు. పోషకాహారంపై అవగాహనను ప్రజల్లో పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. బలమైన, ఆరోగ్యకర దేశ నిర్మాణంలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా నెలరోజులపాటు జరిగే పోషణ్ మాహ్ సందర్భంగా CBC ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జానపద కళాకారులు గవర్నర్ కు సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. జానపద గుస్సడీ, బుర్రకథ, పల్లెసుద్దులు లాంటి రీతులలో పోషకాహార సందేశాన్ని అందించారు. ఈ ప్రదర్శన మరో నాలుగు రోజులు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.

(MSL)

**LIC:**

LIC 68వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని జోనల్ కార్యాలయంలో జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ LIC జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా

ఆయన మాట్లాడుతూ, 1956లో 5 కోట్ల రూపాయిల మూలధనంతో ప్రారంభమైన LIC ప్రస్తుతం, ప్రపంచంలోనే అగ్రశ్రేణి బీమా  బ్రాండ్‌గా నిలిచిందన్నారు. దాదాపు 98 వేల మంది ఉద్యోగులు, 14 లక్షల మందికి  పైగా ఏజెంట్లతో, దేశం ప్రతి మూల LIC విస్తరించిందన్నారు.

(MSL)

**వరంగల్ వర్షాలు**

వరంగల్ జిల్లా వ్యాప్తంగా నేడు అనేక ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు . ఇది ఇలా ఉంటే గత 24 గంటల్లో వరంగల్ జిల్లా వ్యాప్తంగా 53.5 మిల్లీమీటర్ల మోస్తరు వర్షపాతం నమోదయిందని వరంగల్ జిల్లా ప్రణాళిక అధికారి డాక్టర్ జీవరత్నం వెల్లడించారు.

పిటిసి, వరంగల్

సూర్యాపేట-చెరువు

సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం  , కందిబండ చెరువుకు గండి పడటంతో చెరువు పై ఉన్న బ్రిడ్జి ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో కోదాడ మేళ్లచెరువు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

(పీటీసీ, సూర్యపేట)

కరీంనగర్-వర్షాలు

ఉమ్మడి  కరీంనగర్ జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. కరీంనగర్ వరంగల్ ప్రధాన జాతీయ రహదారి పై నీరు నిలవడం తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పారిశుధ్య విభాగం కార్మికులు దాదాపు 50 గ్రామాలకు రాకపోకలు నిలిపి వేశారు.

(పీటీసీ, కరీంనగర్)